క్లుప్తంగా

మంత్రి సురేఖకు సన్మానం



గీసుకొండ: రాష్ట్ర మంత్రి పదవి చేపట్టిన సందర్భంగా కొండా సురేఖను మండలంలోని ఎలుకుర్తి హవేలికి చెందిన ఎంపీపీ భీమగాని సౌజన్యతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్ల సురేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన హైకోర్టు న్యాయవాది

సంగెం : రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొండా సురేఖను సంగెం మండలం చింతలపల్లికి చెందిన హైకోర్టు న్యాయవాది, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తీగల రాజేష్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం మంత్రి స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోల్తి కిరణ్‌గౌడ్, ఎండీ యాకూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

రేవూరిని కలిసిన శ్రేణులు



సంగెం: పరకాల ఎమ్మెల్యేగా ఎన్నికైన రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల శ్రేణులు హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని పూలబోకే అందించి శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కట్టయ్య, నాయకులు స్వామి, మల్లేశం, సదానందచారి, సాంబయ్య, చందు, కుమారస్వామి, యాకయ్య, రమేశ్, ఆనందం, బాబు, కిషన్ పాల్గొన్నారు.

కోటమైసమ్మకు పూజలు

గీసుకొండ: మండలంలోని సుప్రసిద్ధ కోటమైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరకాల ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం తొలిసారిగా ఆయన మండలానికి వచ్చిన సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊకల్ క్రాస్ రోడ్డు సమీపంలోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో జరిగిన ప్రైవేట్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు చాడ కొమురారెడ్డి, మండల అధ్యక్షులు తుమ్మనపెల్లి శ్రీనివాస్, దౌడు భరత్, ప్రవీణ్, తాటికొండ నరేందర్, వటుకుల ప్రశాంత్, జీవన్, నాగరాజు, రాజు, ఏనుగుల సాంబరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



వర్ధన్నపేట: తెలంగాణ రాష్ట్ర సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మండలంలోని వర్ధన్నపేట, తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. కట్య్రాల గ్రామంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గుజ్జ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం రవీందర్‌రెడ్డి, వెంకటయ్య మాట్లాడారు. ఆరు గ్యారెంటీ పథకాల అమలులో భాగంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే సీఎం మొదటి సంతకంతో దివ్యాంగురాలు రజనికి ఉద్యోగం ఇచ్చి మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. కార్యక్రమాల్లో నాయకులు బండారి సతీశ్, మునిగాల పద్మ, కట్ట వెంకటయ్య, చెవ్వల బొంద్యాలు, ముత్యాల దీపక్, మునిగాల సృజన్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

పర్వతగిరి: పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం మండల నాయకుడు జడల కృష్ణ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ పార్టీల నాయకులు శాసనసభ ఎన్నికల్లో తగిన ప్రాధాన్యం కల్పించలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ నాయకుడిని సీఎం చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించిన నేపథ్యంలో పార్లమెంటరీ సమావేశాల్లో బిల్లు పెట్టి ఆమోదిస్తే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. పార్లమెంటులో బిల్లు పెట్టే విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవ చూపాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఖానాపురం: మండల పరిషత్ కార్యాలయంలో నేడు (శనివారం) ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుమణవాణి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ ప్రకాశ్‌రావు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వైభవంగా పల్లివేట



అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ఉత్సవ విగ్రహాన్ని తీసుకొస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి

- అయ్యప్ప ఆలయంలో పూజలు
- పట్టణంలో ఉత్సవ విగ్రహం ఊరేగింపు

నర్సంపేట: పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో శుక్రవారం పల్లివేట కార్యక్రమం వైభవంగా సాగింది. కేరళలోని శబరిమలై సమీపంలోని పుంగవనంలో నిర్వహించే తీరుగా పల్లివేట కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీమాన్ బ్రహ్మశ్రీశ్రీ సి.వెంకటేశ్‌శర్మ గురుస్వామి వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయంలో గురుస్వాములతో కలిసి ఉదయం పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయంలో 23వ మండల పూజా మహోత్సవాల్లో భాగంగా పల్లివేట ఉత్సవదాత, బీఆర్ఎస్ నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి దంపతులు పుష్పాభిషేకం, పూజలు నిర్వహించగా స్వామివారి పల్లకి సేవలో మహిళలు ప్రదక్షిణలు చేస్తూ ధ్వజస్తంభం నుంచి పడిమెట్ల మీదుగా స్వామి వారిని తీసుకొచ్చారు. ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి రాణాప్రతాప్‌రెడ్డి నెత్తిన ఎత్తుకుని తీసుకొచ్చి అలంకరించిన ట్రాక్టర్‌లో ప్రతిష్ఠించారు. డప్పుచప్పుళ్లు, మహిళల కోలాటాల నడుమ శోభాయాత్ర ఊరేగింపు ఆలయం నుంచి మున్సిపల్ కార్యాలయ ఆవరణ వరకు సాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని కిషన్ మంగళహారతులతో స్వాగతం పలుకగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పుంగవనం (కుటీరం)లో నిర్వహించిన పల్లివేట ఉత్సవం భక్తులు, మాలదారులను ఆకట్టుకుంది. అనంతరం అష్టోత్తర పూజలు చేసి హారతి ఇవ్వడంతో పల్లివేట ఉత్సవం ముగిసింది. అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో మాలధారులు, భక్తులకు గోగుల ప్రతాప్‌రెడ్డి జయశ్రీ, గోగుల రాణాప్రతాప్‌రెడ్డి లక్ష్మీభార్గవి, జనగం రామారావు సాంబలక్ష్మి, వడ్డూరి తిరుమలచారి, కాకతీయ గురుకుల రుద్రగూడెం గుజ్జుల మాధవరెడ్డి పద్మ అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖర్, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, చింతల కమలాకర్‌రెడ్డి, శ్రీరాముల శంకరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, దొడ్డ వేణు, మల్యాల రాజు, శింగిరికొండ వేణుగోపాల్, పబ్బ రమేష్, పాలకుర్తి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా దూడల పంపిణీ



దూడలు పంపిణీ చేస్తున్న మహేశ్ అగర్వాల్

నెక్కొండ: గిరిజన పాడి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా గోశాల ఆధ్వర్యంలో దూడలు పంపిణీ చేస్తున్నట్లు తెలంగాణ గోశాల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ తెలిపారు. మండలంలోని రెడ్లవాడ శివారు అడ్డబాట (ఏబీ) తండాలో శ్రీ మంజునాథ గోశాల వేల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 10 మంది గిరిజన రైతులకు రెండేసి చొప్పున 20 కోడెలేగ దూడలను శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం మహేశ్ అగర్వాల్ మాట్లాడారు. పాడి రైతులు పశువులకు వైద్యసేవల కోసం 1962 అంబులెన్స్‌ను వినియోగించుకోవాలని చెప్పారు. రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం దెబ్బ తింటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాలోతు పూర్ణ, గోశాల ప్రతినిధి దుర్గం రోజ,, వెంకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

నెక్కొండ: మండలంలోని పనికరలో కాంగ్రెస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ ప్రకటించారు. గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కమిటీ అధ్యక్షుడిగా చెరుకు యాకయ్య, ఉపాధ్యక్షుడిగా ముద్రబోయిన నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కొత్త రవీందర్‌రెడ్డి, ముఖ్య సలహాదారుగా మెండె రమేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వరంగంటి అఖిల్, ఉపాధ్యక్షుడిగా కాశబోయిన శ్రీనివాస్, కార్యదర్శిగా బండారి రమేశ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యాకయ్య, అఖిల్ మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించేలా చొరవ తీసుకుంటామని చెప్పారు. కమిటీ ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే కడియం వ్యాఖ్యలు సిగ్గుచేటు



మాట్లాడుతున్న బొల్లెద్దు వికాస్‌రెడ్డి

ధర్మసాగర్: ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లెద్దు వికాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దపెండ్యాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోతులు తవ్వే స్వభావాన్ని కడియం శ్రీహరి ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. గతంలో దివంగత నేత ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని పడగొట్టడంలో కూడా కడియం పాత్ర పోషించారని విమర్శించారు. బీజేపితో కలుపుకొని 54 సీట్లు ఉన్నాయని అనడంతో బీజేపితో బీఆర్ఎస్‌కు ఉన్న లోపాయికారి ఒప్పందం బయటపడిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాకపోవడంతో ఆపార్టీ నాయకులు నోటికి వచ్చింది మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. మండల కోఆర్డినేటర్ కొత్తపల్లి భిక్షపతి, విజయ్‌రెడ్డి, ప్రవీణ్, సురేష్, చింటూ, అభిషేక్, నేరేల శివ పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని కూలుస్తామనడం శోచనీయం

ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని కూల్చేందుకు కడియం శ్రీహరి ఎంతటికైనా దిగజారుతారా అని జన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు భరత్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఆరు నెలల్లో కూలిపోతుందని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని, బాధ్యతగల శాసన సభ్యుడి హోదాలో ఉండి అలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా కుట్రలు మానుకుని ప్రభుత్వానికి, ప్రజలకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభాకర్, రవీందర్, వేణుగోపాల్, కార్తిక్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ధర్మసాగర్ : రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

ధర్మసాగర్: మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం బత్తిని రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న కాజీపేటలోని సెయింట్ గాబ్రియేల్ గ్రౌండ్‌లో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–17 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ఆర్.సాకేత్, ఎం.మల్లికార్జున్, పి.లక్ష్మి, సిహెచ్.శ్వేత, జి.అభినవవర్షిని, వై.అక్షయ ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల మండలం బాదేపల్లిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను, పీఈటీ సుధాకర్‌ను సర్పంచ్ ఆకారపు అన్నమ్మ, ఎంపీటీసీ నాగయ్య, మాజీ సర్పంచ్ తోట స్రవంతి, నాగరాజు, ఉప సర్పంచ్ శివాకర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ మామిడాల కిషోర్, బత్తిని రాజ్‌కుమార్, సోమ అమర్నాథ్, పీఎస్ హెచ్ఎం చాడ మల్లారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కవిత తెలిపారు. ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సాయిశ్రుతి, లహరి, సానియాకౌశ్ర, అర్పిత జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రుల కీర్తిప్రతిష్ఠలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. పాఠశాలలో క్రీడల దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

‘కోడ్’ ముగిసినా తొలగని ముసుగులు



వర్ధన్నపేట: రాష్ట్ర శాసనసభ ఎన్నికలు ముగిసి ఫలితాలు సైతం వెలువడ్డాయి. ఈనెల 4 వరకు అమలులో ఉన్న ఎన్నికల కోడ్ ముగిసింది. అయినా పట్టణంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, తెలంగాణ తల్లి విగ్రహాలకు వేసిన ముసుగును నేటికీ తొలగించలేదు. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ పట్టణ వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రాజీవ్ గాంధీ, తెలంగాణ తల్లి విగ్రహాల ముసుగులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి పరికరాల అందజేత



గీసుకొండ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రానికి స్థానిక యువకులు శుక్రవారం పరికరాలను అందజేశారు. పిల్లల ఎత్తు, బరువు కొలిచే పరికరాలను పొగాకు వంశీగౌడ్, దిడ్డి రవి, ఇంతియాజ్ సొంత డబ్బులతో కొనుగోలు చేసి అందించారు. యువకులను గ్రామస్తులు అభినందించారు.

‘కొండా’కు మంత్రి పదవి రావడంతో మొక్కులు



గీసుకొండ: వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖకు మంత్రి పదవి లభించిన నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ పరిధి 16వ డివిజన్ ధర్మారం ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బొల్లం శివ ఆధ్వర్యంలో యువకులు మేడారంలో సమ్మక్క–సారలమ్మలకు శుక్రవారం మొక్కులు చెల్లించారు. కొండా సురేఖకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు లభించాలని సమ్మక్క, సారలమ్మలకు మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శశిధర్, నితిన్, రాకేశ్, మహేశ్, సూర్య, రాహుల్, కేశవ్ పాల్గొన్నారు.

పరామర్శ

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన పి.సౌందర్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరామర్శించారు. సర్పంచ్ పర్వతగిరి రాజు, గ్రామ అధ్యక్షుడు బయ్య కుమారస్వామి, పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, డైరెక్టర్ రేవూరి జయపాల్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే క్రిమినల్ కేసులు



శాయంపేట : ప్రకృతిలో స్వేచ్ఛగా జీవించే వన్యప్రాణులను వేటాడితే చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మైసయ్య హెచ్చరించారు. ఐఎఫ్ఎస్ లావణ్య, ఎఫ్ఆర్ఓ భిక్షపతి ఆదేశాల మేరకు మండలంలోని శాయంపేట, పత్తిపాక గ్రామాల్లోని పాత నేరస్తుల ఇళ్లలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం ఫారెస్ట్ అధికారులు ఆకస్మికంగా సోదాలు చేశారు. పక్షులు, జంతువులను వేటాడానికి వినియోగించే జాలీలు, వలలు, ఉచ్చులను స్వాధీనం చేసుకొని హనుమకొండలోని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. వేటగాళ్లు తమ ఇళ్లలో వన్యప్రాణులను వేటాడేందుకు వినియోగించే వలలు ఉచ్చులు పాతవైనప్పటికీ ఇళ్లలో ఉంచుకోకూడదని అన్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌లు రతన్లాల్, బండి బలరాం, పాడెం సుగుణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ



దుగ్గొండి: ఎమ్మెల్యే మాధవరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు



నర్సంపేట : ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసీపీ, తదితరులు

దుగ్గొండి: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారిగా నియోజకవర్గానికి చేరుకున్న మాధవరెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ పరిధిలోని 6 మండలాల నుంచి శ్రేణులు వేలాదిగా తరలివచ్చి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎమ్మెల్యేతో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రారంభమైన ర్యాలీ లక్నెపల్లి, మహేశ్వరం మీదుగా నర్సంపేటకు సాగింది. కార్యక్రమంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, బీరం సంజీవరెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, ఇంద్రదేవ్, నరిగె ప్రవీణ్‌కుమార్, ఎడెల్లి శ్రీనివాసరెడ్డి, మట్ట రాజు, మాదాసి సాంబయ్య, జయరాంనాయక్, ధంజ్యానాయక్, రవీందర్‌నాయక్, రాజేశ్వర్‌రావు, పాదిల నరేశ్, కొరే రాజేశ్, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

కలిసిన పోలీసు అధికారులు

నర్సంపేట: నర్సంపేట ఎమ్మెల్యేగా గెలిచి తొలిసారిగా పట్టణానికి వచ్చిన సందర్భంగా దొంతి మాధవరెడ్డిని పోలీసు అధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో ఎమ్మెల్యే మాధవరెడ్డిని ఏసీపీ తిరుమల్, సీఐలు, ఎస్సైలు కలిసి తొలుత పుష్పగుచ్ఛాలు అందజేశారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

ఖానాపురం: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ నాయకుడు చెడిపాక ఉపేందర్ స్పష్టం చేశారు. మండలంలోని బుధరావుపేటలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఆరు గ్యారెంటీ పథకాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం నర్సంపేటలో జరిగిన విజయోత్సవాలకు నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో వెంకన్న, మల్లేశ్, రజినీకాంత్, లింగయ్య, చాంద్‌పాషా పాల్గొన్నారు.

కంకర పోశారు... బీటీ విస్మరించారు...



కంకరతో వదిలేసిన భోజ్యానాయక్‌తండా రోడ్డు

నర్సంపేట రూరల్ : కంకర పోసి బీటీ వేయడాన్ని విస్మరించడంతో మండలంలోని మాదన్నపేట–భోజ్యానాయక్‌తండాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని మాదన్నపేట నుంచి భోజ్యానాయక్‌తండాకు వెళ్లే రోడ్డు సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉంటుంది. ఈ రెండు గ్రామాల నడుమ రైతుల వ్యవసాయ భూములున్నాయి. నిత్యం రెండు గ్రామాల ప్రజలు, రైతులు రాకపోకలు సాగించడం పరిపాటి. భోజ్యానాయక్ తండా నుంచి నర్సంపేటకు రావాలంటే మాదన్నపేట మీదుగా త్వరగా చేరుకోవచ్చు. లేదంటే చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుంది. ఈ రెండు గ్రామాలకు నడుమ ఉన్న సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డుకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గత ప్రభుత్వం బీటీ రోడ్డు మంజూరు చేసి రూ.72 లక్షలు కేటాయించింది. దీంతో నాటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మే నెలలో పనులను ప్రారంభించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మట్టి రోడ్డును తవ్వి కంకర పోసి చేతులు దులుపుకున్నారు. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పలుమార్లు ఈ రోడ్డుపై ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని రోడ్డుపై బీటీ పనులు పూర్తి చేయించాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్షేత్రపర్యటనతో విద్యార్థుల్లో అవగాహన



కుండ తయారీని పరిశీలిస్తున్న విద్యార్థులు

వర్ధన్నపేట: వృత్తిదారులు, ఇతర అంశాలపై విద్యార్థి దశ నుంచే క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తే భవిష్యతులో నిపుణులు అవుతారని స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు దేవయ్య, వంశీమోహన్ తెలిపారు. క్షేత్రపర్యటనలో భాగంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 7, 8వ తరగతుల విద్యార్థులను మండలంలోని ఇల్లంద గ్రామానికి శుక్రవారం తీసుకెళ్లారు. అక్కడ కుమ్మరి వృత్తిదారులు తయారు చేసే కుండలను, చేనేత మగ్గం ద్వారా బట్టల నేత విధానాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా చూసి పలు అంశాలపై వృత్తిదారుడిని, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

ఉద్యమకారుడికి ‘అరూరి’ నివాళి

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, ఉద్యమకారుడు కాత నాగయ్య (55) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి శుక్రవారం నాగయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు శ్రీరాములు, భిక్షపతి, ఎంపీపీ మధుమతి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు సంపత్‌కుమార్, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ రమేష్, మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్ తదితరులున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

దామెర: జాతీయస్థాయి కుస్తీ పోటీలకు మండలంలోని తక్కళ్లపహడ్ గ్రామానికి చెందిన సీహెచ్.ప్రీతం ఎంపికయ్యారు. గత నెల 25న హనుమకొండ జిల్లా కేంద్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో జరిగిన యునివర్సిటీ స్థాయి, పంజాబ్‌లో జరిగిన సౌత్‌వెస్ట్ 60 కిలోల విభాగం కుస్తీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రీతమ్‌ను కోచ్ రాజును గ్రామ సర్పంచ్ రాజేందర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.